

అరసవల్లి ఈవోగా చంద్రశేఖర్



చంద్రశేఖర్

అరసవల్లి, మార్చి 13: అరసవల్లి ఆదిత్యాలయం ఈవో రమేష్ బాబుకు అన్నవరం దేవస్థానానికి ఆకస్మికంగా బదిలీ కాగా.. ఆయన స్థానంలో అక్కడి నుంచి జిల్లాకు ఎస్.చంద్రశేఖర్ రానున్నారు. గత నెల 8న విధుల్లో చేరిన రమేష్‌బాబు నియంతలా వ్యవహరించిన తీరే ఆకస్మిక బదిలీకి కారణమని తెలుస్తోంది. ఎవరితోనూ సఖ్యత పాటించకపోవడం, సిబ్బందితో కూడా దురుసుగా ప్రవర్తించడం వంటి విషయాల్లో ఆయన పలు విమర్శలు ఎదుర్కొన్నారు. కాగా.. ఎస్.చంద్రశేఖర్ గతంలో జిల్లా ఏసీగా పనిచేశారు. ఆయన గురువారం విధుల్లో చేరే అవకాశం ఉంది.

ఆరోగ్యశ్రీ నిలిచిపోతుందా?

- ఈ నెల 18 నుంచి సేవలు బంద్
- ప్రకటించిన నెట్‌వర్క్ ఆస్పత్రులు
- రూ.1,400కోట్ల బిల్లుల పెండింగ్ కారణం
- ఆందోళనలో పేద, మధ్యతరగతి ప్రజలు
- ప్రభుత్వ తీరుపై విమర్శలు

ఆరోగ్యశ్రీ.. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మానసపుత్రిక. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించాయి. అందుకే ఆరోగ్యశ్రీ విషయంలో మహత్తర నిర్ణయం తీసుకుంటున్నా. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతున్నా. దేశంలో ఇదో ఆదర్శవంతమైన, సాహసోపేత నిర్ణయం.

-కొద్దిరోజుల కిందట సీఎం జగన్ చేసిన ప్రకటన ఇది.

సీన్ కట్ చేస్తే..

ఆరోగ్యశ్రీ సేవలు త్వరలో నిలిచిపోనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రూ.1400 కోట్ల చెల్లింపులు నిలిచిపోవడమే అందుకు కారణం. ఈ నెల 18 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్టు నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం ప్రభుత్వానికి స్పష్టం చేసింది. బకాయిల విషయంలో ఇప్పటికే ప్రభుత్వం మూడుసార్లు మాట తప్పిందని, ఇక ప్రభుత్వం మాట నమ్మేది లేదని ఆరోగశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు తేల్చిచెబుతున్నాయి. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.




(రణస్థలం)

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం తీరుతో ఈ నెల 18 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. బిల్లులు సక్రమంగా చెల్లించాలని ఎప్పటికప్పుడు నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం ప్రభుత్వానికి విన్నవిస్తునే ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. గతేడాది మే నెలలో సుమారు రూ.2వేల కోట్లు బకాయిలు పేరుకుపోగా.. సేవల నిలిపివేతకు నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయించాయి. ప్రభుత్వం హడావుడిగా ఆ నెలకు సంబంధించి రూ.200కోట్లు బకాయిలు విడుదల చేసింది. విడతల వారీగా బకాయిలు చెల్లించగా.. డిసెంబరు నెల నుంచి మళ్లీ నెమ్మదించింది. అప్పటికి సుమారు రూ.1000కోట్లు బకాయి చేరుకుంది. దీంతో అదే నెల 29నుంచి ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేతకు నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయించాయి. దీంతో ప్రభుత్వం అసోసియేషన్ ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. బకాయిల చెల్లించడానికి ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో యథావిధిగా సేవలు కొనసాగించారు. అయితే ఈ ఏడాది జనవరిలోనూ బకాయిలు చెల్లించలేదు. దీంతో జనవరి 24 నుంచి సేవలు నిలిపివేతకు నిర్ణయించారు. మరోసారి ప్రభుత్వం కొద్దిపాటి మొత్తాన్ని చెల్లించి సేవలు కొనసాగించేలా చేసింది. అయితే ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం సమీపిస్తుండడం, ఎన్నికలు రానుండడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు మేల్కొన్నాయి. సుమారు రూ.1400 కోట్లు బకాయిలు పేరుకుపోవడంతో ఈ నెల 18 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల్లో ఆందోళన నెలకొంది.

● ఆస్పత్రుల్లో అందని సేవలు

ఆరోగ్యశ్రీ ద్వారా అత్యవసర వైద్యసేవల కోసం వెళ్తున్న వారికి అక్కడ చుక్కెదురవుతోంది. ప్రభుత్వం మాత్రం ఆరోగ్యశ్రీకార్డు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి రూ.25లక్షల సాయం అందుతుందని చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆరెగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు రకరకాలుగా కొర్రీలు పెడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ పరిధిలో 11 ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రితో పాటు మూడు ఏరియా ఆస్పత్రులో ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నారు. ప్రభుత్వం 3,255 రోగాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చింది. ఇందులో రెగ్యులర్ రుగ్మతలకు సంబంధించి మాత్రం ఆపరేషన్లు, వైద్యసేవలను చేర్చలేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ కన్నా.. సాధారణ వైద్యసేవలకు ప్రాధాన్యమిస్తున్నాయి. అయితే ఒడిశా నుంచి వచ్చిన రోగులకు మాత్రం ఆరోగ్యశ్రీ ద్వారా సేవలందిస్తున్నాయి. అక్కడి ప్రభుత్వం అప్రూవల్ వచ్చిన పదిరోజుల్లోనే బిల్లులు చెల్లించడమే ఇందుకు కారణం.

● ఆరోగ్యశ్రీ సేవలకుగాను ప్రతీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఒక కోఆర్డినేటర్‌ను నియమించారు. వీరు కొన్నిచోట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ సేవలు ఎలా పొందాలో అవగాహన ఉండదు. ఏ ధ్రువపత్రాలు తీసుకురావాలో తెలియదు. అటువంటి వారు అత్యవసర వైద్యానికి వచ్చినప్పుడు ఓపికగా సమాధానం చెప్పాల్సిందిపోయి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలో వైద్యసేవల కోసం రోగి చేరిన నాటి నుంచి ఆపరేషన్ తరువాత వసతి, భోజనం, మందులు అందించాల్సి ఉంటుంది. దాదాపు ఆరు నెలల వరకూ వారికి మందులు అందించాలి. కానీ ఇదెక్కడ అమలవుతున్న దాఖలాలు లేవు. బాధితులు కూడా అవగాహన లేక వినియోగించుకోలేకపోతున్నారు. ఒక్కో ఆరోగ్యశ్రీ కార్డుకు రూ.25 లక్షల వరకూ వెసులబాటు ఉంటుంది. రోగికి వైద్య పరీక్షలు, ఆపరేషన్లు, మందులు, భోజనం, వసతి ఇవన్నీ లెక్క కట్టి ఆ మొత్తంలో తీసుకుంటారు. అయితే కొన్ని ఆస్పత్రులు ఖర్చుకు మించి ఆరోగ్యశ్రీలో జమ చేసుకుంటున్నాయన్న విమర్శలు ఉన్నాయి.



ఇది దారుణం..

వైసీపీ సర్కారు ప్రజారోగ్యానికి పెద్దపీట వేయడం లేదు. కేవలం ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమైంది. రాష్ట్రవ్యాప్తంగా రూ.1400 కోట్లు బకాయిలు పెట్టడం దారుణం. ఇలాగైతే ఆస్పత్రులను ఎలా నడిపేది. అందుకే చాలా ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలకు దూరమవుతున్నాయి. కనీసం ఎన్నికల ముంగిట అయినా బకాయిలు చెల్లించకపోవడం అన్యాయం. ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోతే దేశంలో రాష్ట్ర పరువు పోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలి.

-ప్రముఖ వైద్యుడు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్కు ఆస్పత్రి

ప్రస్తుతానికి.. పదివేలు ఉంచండి

- వలంటీర్లు, జర్నలిస్టులకు తాయిలాలు
- పాతపట్నంలో వైసీపీ పంపిణీ పర్వం

పాతపట్నం/హిరమండలం, మార్చి 13: ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే.. వైసీపీ నాయకులు తాయిలాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. నోటుతోనే ఓటు అనే నినాదంతో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఓటర్లను ప్రభావితం చేసే ఏ అవకాశాన్ని వదలడం లేదు. సమావేశాలంటూ పిలవడం.. ఇంటికి వచ్చినవారికి విందు పెట్టి.. చీరలు, మిక్సీలు, గ్రైండర్లు వంటివి పంపిణీ చేస్తున్నారు. వలంటీర్లు, జర్నలిస్టులకు సైతం డబ్బుల రూపంలో తాయిలాలు అందజేస్తున్నారు. ప్రధానంగా పాతపట్నం నియోజకవర్గంలో ఒక్కొక్కరికి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు తాయిలాలు ఇస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో పంపిణీల పర్వం వైరల్ కావడంతో చర్చనీయాంశమవుతోంది.



పాతపట్నంలో వైసీపీ క్యాంపు కార్యాలయం వద్ద వలంటీర్ల సందడి

● పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఈ నెల 12న నియోజకవర్గంలో విలేకరులందరికీ పాతపట్నంలోని తన క్యాంపు కార్యాలయానికి రావాలని వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్‌లు పెట్టారు. అక్కడికి వెళ్లిన ఒక్కో విలేకరికి రూ.5వేలు చొప్పున అందజేశారు. తమకు అనుకూలంగా వార్తలు రాయకపోయినా ఫర్వాలేదు కానీ, వ్యతిరేకంగా వార్తలు రాయొద్దని విలేకరులకు దిశానిర్దేశం చేసినట్టు తెలుస్తోంది. తాజాగా బుధవారం వలంటీర్లతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని 1,500 మంది వలంటీర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున తాయిలం అందజేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చేలా ఓటర్లను ప్రభావితం చేయాలని వారికి సూచించారు. ప్రస్తుతానికి రూ.10వేలు ఉంచండి. ఎన్నికల్లో బాగా పని చేసి అధికారంలోకి వస్తే మీ కష్టం ఉంచుకోమని ఆమె భరోసా ఇచ్చినట్టు తెలిసింది.

● నిబంధనల ప్రకారం ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకునే ఏ ఒక్కరూ కానుకలతో ప్రలోభాలకు గురిచేయడానికి వీల్లేదు. కానీ వైసీపీ పాలనలో ఈ నిబంధనలన్నీ అటకెక్కాయి. ప్రస్తుతం వైసీపీకి ఎదురుగాలి వీస్తుండడంతో.. ముందు నుంచే ప్రలోభాల పర్వానికి తెరతీశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు కోలాహలం

మెళియాపుట్టిలో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే రెడ్డిశాంతి కుమారుడు వంశీకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధికంగా వలంటీర్లు పాల్గొనడం చర్చనీయాంశమైంది. ఇంటింటి ప్రచారంలో వలంటీర్లు కోలాహలం కనిపించింది. ఎన్నికల కమిషన్ మాత్రం వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని ప్రకటించినా.. వంలంటీర్లు దూరంగా ఉండే పరిస్థితి కనిపించటం లేదు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- మెళియాపుట్టి

నెరవేరిన కల

- నర్సిపురం రైల్వే ఫుట్‌బ్రిడ్జి ప్రారంభం

పలాస, మార్చి 13: స్థానిక 8వ వార్డు నర్సిపురం ప్రజల కలను ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు బుధవారం నెరవేర్చారు. రైల్వేశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఫుట్‌బ్రిడ్జిని ఆయన ప్రారంభించారు. పలాస రైల్వేస్టేషన్‌కు ఆనుకొని నర్సిపురం కాలనీ ఉంది. పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలకు రాకపోకలు సాగించాలంటే ఈ బ్రిడ్జి గతి. లేదంటే చుట్టూ 3కిలోమీటర్లు తిరిగి జంట పట్టణాలకు చేరుకోవాలి. రైల్వేశాఖ ఏర్పడినప్పటి నుంచి ఈ బ్రిడ్జి ఎంతో ఉపయోగంగా ఉంది. అయితే ఏడాది కిందట అధికారులు ఈ బ్రిడ్జిని బంద్ చేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల ఎంపీ రామ్మోహన్‌నాయుడు రైల్వేస్టేషన్‌కు వచ్చినప్పుడు ప్రజలు తాము పడుతున్న ఇక్కట్లను వివరించారు. దీంతో ఆయన రైల్వే మంత్రిత్వశాఖతో పాటు ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులు(భువనేశ్వర్)తో మాట్లాడి వారిని పలాస రైల్వేస్టేషన్‌కు రప్పించి సమస్యలు స్వయంగా చూపించారు. రైల్వే స్టాండింగ్ కమిటీలో కూడా ఈ అంశాన్ని లేవనెత్తడంతో అధికారులు యుద్ధప్రాతిపదికన పాత బ్రిడ్జిని తొలగించి కొత్తది నిర్మించారు. సుమారు రూ.50లక్షల వరకూ వెచ్చించి పనులు పూర్తి చేశారు. దీన్ని ఎంపీ రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. తమ కష్టాలు తీర్చిన ఎంపీ రామ్మోహన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషకు స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, నవీన్, రవిశంకర్‌గుప్తా, శాసనపురి మురళీకృష్ణ, మల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.



నర్సిపురం రైల్వే ఫుట్‌బ్రిడ్జి ప్రారంభిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

ఎన్నికల సన్నద్ధతపై అభ్యంతరాలుంటే చెప్పండి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మార్చి 11: జిల్లాలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై ఏవైనా అభ్యంతరాలుంటే నేరుగా జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అనుబంధ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, రానున్న ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో 37వ వారపు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'ఎన్నికల నిర్వహణకు సర్వసన్నద్ధంగా ఉన్నాం. రెండు నెలల్లో 2,82,688 ఓటరు గుర్తింపు కార్డులను ముద్రణకు పంపాం. వీటిలో 1,83,907 కార్డులను పోస్టల్ శాఖ ద్వారా పంపిణీ చేశాం. మిగిలినవి త్వరగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. ఎచ్చెర్ల శివానీ ఇంజనీరింగ్ కాలేజీని ఓట్ల లెక్కింపు కేంద్రంగా ఎంపిక చేశాం. పోలింగ్‌కు సంబంధించి ఇప్పటికే సిబ్బందికి పలు దశల్లో శిక్షణ పూర్తయింది. ఎన్నికల సమయంలో నగదు, మద్యం పంపిణీ చేసేవారిపై, నియమాలను ఉల్లంఘించేవారిపై కఠినచర్యలు తీసుకుంటాం. ఇందుకోసం ప్రత్యేకంగా 18004256625 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామ'ని తెలిపారు. గడిచిన వారం రోజుల్లో ఓటర్ల జాబితా మార్పులు చేర్పులుపై 2,295 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీవోలు రంగయ్య, భరత్‌నాయక్‌తోపాటు రాజకీయ పార్టీల నేతలు పీఎంజే బాబు(టీడీపీ), రౌతు శంకరరావు(వైసీపీ), సురేష్‌సింగ్ బాబు(బీజేపీ), మల్లిబాబు (కాంగ్రెస్), సోమేశ్వరరావు(బిఎస్పీ), తిరుపతిరావు(సీపీఐ) పాల్గొన్నారు.

అవగాహనతోనే అంతర్జాల నేరాల నియంత్రణ సాధ్యం

- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

కలెక్టరేట్, మార్చి13: అంతర్జాల నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అవగాహనతోనే నేరాల నియంత్రణ సాధ్యమని జేసీ ఎం.నవీన్ పేర్కొన్నారు. ఈ నెల 15న అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అంబేద్కర్ యూనివర్సిటీలో సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇంటర్‌నెట్ అధికంగా వినియోగంలోకి వచ్చాక ఎందరో సైబర్ మోసగాళ్ల బారిన పడి డబ్బులు నష్టపోతున్నారన్నారు. బాధితుల్లో అధికంగా విద్యార్థులు ఉండడం గమనార్హమని తెలిపారు. ఇటీవల విద్యార్థులు కూడా ఎక్కువగా మొబైల్ ఫోన్లు వినియోగిస్తున్నారని, కంప్యూటర్ గేమ్స్ ఆడుతూ మోసగాళ్ల వలలో చిక్కుకునే ప్రమాదం ఉందన్నారు. మోసాల బారిన పడకుండా ఉండాలంటే అప్రమత్తత అవసరమని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సు నిర్వహిస్తున్న ఆశ్రా ప్రతినిధులు డాక్టర్ గంజి ఎజ్రా, జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు, ఆశ్రా కార్యనిర్వాహక సభ్యుడు లఖినాన రవికుమార్, కట్టా పార్థసారధిని జేసీ అభినందించారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ నవీన్

వంతెనను ఢీకొన్న లారీ

- కాలువలో పడి డ్రైవర్, క్లీనర్ మృతి
- ఒడిశాలో ప్రమాదం
- జమ్ము, కిల్లాంలో విషాదఛాయలు

నరసన్నపేట, మార్చి 13: ఒడిశా రాష్ట్రం మయూర్‌భంజ్ జిల్లా బైరపదా పట్టణం సమీపంలో వంతెనను ఢీకొని ఓ లారీ సువర్ణరేఖ కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో నరసన్నపేట మండలం జమ్ము, కిల్లాం గ్రామాలకు చెందిన లారీడ్రైవర్, క్లీనర్ మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జమ్ము గ్రామానికి చెందిన రావాడ జనార్దనరావు లారీ.. ఈ నెల 11న ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో నీలగిరి కర్ర దిమ్మల లోడుతో నేపాల్ పయనమైంది. మంగళవారం అర్ధరాత్రి ఒడిశా- జార్ఖండ్ సరిహద్దున బైరపదా పట్టణానికి సమీపంలో వంతెనను ఢీ కొని అక్కడ సువర్ణరేఖ కాలువలో లారీ పడిపోయింది. ఈ ప్రమాదంలో కిల్లాం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ గొలివి ఆదినారాయణ (44), జమ్ము గ్రామానికిచెందిన కొయ్యాన చిన్నారావు(38) అక్కడక్కడే మృతిచెందారు. లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన వారి మృతదేహాలను ఒడిశా పోలీసులు యంత్రాల సహాయంతో బయటకు తీశారు. డ్రైవర్ ఆదినారాయణకు భార్య రేవతి, తల్లిదండ్రులు తవిటిమ్మ, చిన్నవాడుతో పాటు ఇంటర్, ఎనిమిదో తరగతి చదువుతున్న కుమార్తె, కుమారుడు ఉన్నారు. క్లీనర్ చిన్నారావుకు భార్య శశికళ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇరు కుటుంబాల సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. జమ్ము, కిల్లాం గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకువచ్చేందుకు ఆయా కుటుంబ సభ్యులు ఒడిశా వెళ్లారు.



కాలువలో పడిన లారీ, ఆదినారాయణ, చిన్నారావు(ఫైల్)

త్వరితగతిన చార్జిషీట్ ఫైల్ చేయాలి

- జిల్లా న్యాయాధికారి జేపే మౌలానా

గుజరాతీపేట, మార్చి 13: జైలులోని ముద్దాయిల కేసుల్లో పోలీసులు త్వరితగతిన చార్జిషీట్ ఫైల్ చేయాలని జిల్లా న్యాయాధికారి జునైన్ అహ్మద్ మౌలానా తెలిపారు. ముద్దాయిల కేసుల విషయంలో పోలీసులు అలసత్వం ప్రదర్శించరాదని సూచించారు. బుధవారం జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాల్‌లో అండర్ ట్రైల్ రివ్యూ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి జేపే మౌలానా మాట్లాడుతూ పోలీసు అధికారులు ఈ నెల 16న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు రాజీ చేయడానికి కృషిచేయాలని కోరారు. చిన్నచిన్న కేసులన్నీ లోక్ అదాలత్‌లో రాజీ చేస్తే పోలీసులకు పెద్ద కేసుల విషయంలో దృష్టి పెట్టే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయాధికారులు శ్రీదేవి, భాస్కరరావు, మహేంద్ర ఫణికుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి అనూరాధ, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేపే మౌలానా

పనిచేసే నాయకులకు అండగా నిలవండి

● ఎంపీ రామ్మోహన్‌నాయుడు



సవరరాంపురంలో ప్రసంగిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

నందిగాం: అభివృద్ధి చేస్తూ... ప్రజలకు తోడుగా నిలిచే నాయకులకు అండగా నిలవాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం దిమ్మిడిజోల పంచాయతీ సవరరాంపురం, కాపుతెంబూరు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. సవరరాంపురంలో చెరువుకు వెళ్లే గ్రావెల్ రహదారి, శ్లాబ్ కల్వర్టుకు, కాపుతెంబూరు కుమ్మరి వీధిలో సామాజిక భవనం నిర్మాణానికి పార్టీ శ్రేణులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో దగా, మోసమే తప్ప ప్రజలకు చేసింది శూన్యమని ఎద్దేవా చేశారు. మద్యపాన నిషేధమంటూ మహిళలకు ముద్దులు పెట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మద్యం వ్యాపారం చేసుకొని మహిళల పుస్తెలు తెంపే స్థాయికి చేర్చారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంతో సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందన్నారు. పనిచేసే నాయకత్వానికి యువత పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. సవరరాంపురంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు ట్రాక్టర్‌ను నడిపి గ్రావెల్‌ను అన్‌లోడ్ చేసి అక్కడి వారిని ఆకట్టుకున్నారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు, ఎం.బాలకృష్ణ, టి.ఉమామహేశ్వరరావు, ఎస్.కృష్ణారావు, కె.హరిబాబు, బి.గిరిబాబు, ఎం.మోహనరావు, ఎం.సింహాచలం, ఎం.మోహనరావు, కె.విశ్వనాథం, కె.ధర్మారావు, జనసేన నాయకులు చిరంజీవులు, షణ్ముఖరావు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్

మార్పు మొదలైంది: ఎంపీ



పార్టీలో చేరిన వారితో రామ్మోహన్‌నాయుడు, శిరీష

కాశీబుగ్గ: రానున్న ఎన్నికల్లో వైసీపీని గద్దె దింపడానికి పదో వార్డు నుంచి మార్పు మొదలైందని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. మున్సిపాలిటీ పదో వార్డులో బుధవారం తెలుగుదేశం, జనసేన, బీజేపీల ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నుంచి టీడీపీ, జనసేనలోకి భారీగా చేరారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు, గౌతు శిరీష, దుర్గారావులు కండువాలు వేసి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మంత్రి ఇక్కడ ఎన్ని చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడును, పలాసలో గౌతు శిరీషని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పలాస నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతు శిరీష మాట్లాడుతూ స్థానిక 31వ వార్డులో ప్రజలు దాహంతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వార్డులో ఎక్కడా రోడ్లు, డ్రైనేజీలు నిర్మించలేని దయనీయ స్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని అన్నారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధిస్తే సమస్యలను పీఎం మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల దృష్టిలో పెట్టి పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, నాగరాజు, గాలి కృష్ణారావు, ఉమాకాంత్ బెహరా, సప్ప నవీన్, సూర్యనారాయణ, రవిశంకర్ గుప్తా, బీజేపీ నాయకులు వైకుంఠరావు, రాజు, జనసేన నాయకులు కృష్ణారావు, గిరి, ప్రశాంత్, శ్రీకాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పార్టీలో చేరిన తమ్మినేని తాతయ్య, గంధం కామేష్, తమ్మినేని సోమేష్, బమ్మిడి సాయి, పి.జోగారావు, కంద వినోద్, లాడి పాపారావు, బాలకృష్ణ, జోగారావు, పొందర బలరామ్, నిర్మల తదితరులకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సుమారు 100 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

సూపర్‌సిక్స్‌తో అందరికీ సంక్షేమం..

సంతబొమ్మాళి: తెలుగుదేశం పార్టీ అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలతో అందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని మండల టీడీపీ అధ్యక్షుడు జీరు భీమారావు అన్నారు. బుధవారం తాళ్లవలసలో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి సంపూర్ణ మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు కూశెట్టి భానుప్రకాష్, ఐటీడీపీ అధ్యక్షుడు బెండి అరుణ్‌కుమార్, వజ్జ ప్రభాకర్, సూరాడ దాసురాజు, సువ్వారి ప్రసాద్, అట్టాడ తిరుపతిరావు పాల్గొన్నారు.



తాళ్లవలసలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీని ఆదరించండి..

టెక్కలి: తెలుగుదేశం పార్టీని అందరూ ఆశీర్వదించాలని మండల దేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. బుధవారం టెక్కలి ఎన్టీఆర్ కాలనీ 18వ లైన్‌లో ప్రతి కుటుంబాన్ని కలిసి బాబు సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టెక్కలి ఎన్టీఆర్ కాలనీలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

టీడీపీ బీసీ డిక్లరేషన్‌పై ప్రచారం..

నరసన్నపేట: టీడీపీ మిత్రపక్షాలతో కలిసి రూపొందించిన బీసీ డిక్లరేషన్‌పై గ్రామాల్లో ఇంటింటికీ ప్రచారం చేయాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. బీసీలకు 50 సంవత్సరాలకు పింఛన్, ప్రత్యేక రక్షణ చట్టం, బీసీ సబ్‌ప్లాన్ ద్వారా రూ.లక్షన్నర కోట్ల కేటాయింపు వంటి అంశాలను ఇంటింటికీ తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శిమ్మ చంద్రశేఖర్, జల్లు చంద్రమౌళి, యాళ్ల వేణు, శిమ్మ లక్ష్మణరావు, జగన్నాథం, పూతి రమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు కోసం పనిచేయాలి

నరసన్నపేట: నరసన్నపేటలో టీడీపీ గెలుపు కోసం అందరం కలిసి పనిచేయాలని నియోజకవర్గ జనసేన కన్వీనర్ బలగ ప్రవీణ్ పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జనసేన గ్రామస్థాయి నాయకులు, వీరమహిళలతో సమావేశం నిర్వహించారు. ప్రతి బూత్ వద్ద జనసైనికులు ఉంటూ దొంగ ఓట్లను అడ్డుకోవాలన్నారు. మండల అధ్యక్షులు దండాసి, చంద్రశేఖర్, రుక్కు శ్రీరామమూర్తి, బచ్చల పృధ్వీ, వారాది వరలక్ష్మి, లావేటి బుజ్జిమ్మ, తంగి చలపతిరావు, గొట్ట హరి పాల్గొన్నారు.

మహిళల కలలను నిజం చేసేది టీడీపీ

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న గౌతు శిరీష, తెలుగు మహిళలు

పలాస: మహిళల కలలను నిజం చేసేది ఒక్క తెలుగుదేశం ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. బుధవారం మధ్యాహ్నం టీడీపీ కార్యాలయంలో ఆమె కలలకు రెక్కలు అనే పథకంపై నియోజకవర్గ మహిళలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీని తరిమి కొట్టేందుకు మహిళలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహాశక్తి పేరుతో మహిళలకు అనేక సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుడతామని తెలిపారు. కలలకు రెక్కలు ద్వారా ఉన్నత చదువులకు వెళ్లే యువతులకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నామని చెప్పారు. ఈ పథకానికి యువతులు ఇప్పటి నుంచే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సప్ప అమ్మోజి, డొక్కరి తులసి, జోగ త్రివేణి, తంగుడు ఆశారాణి, టంకాల వినీత, పుచ్చ శోభారాణి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి ప్రసన్నలత

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

టెక్కలి: స్థానిక కోర్టుల సముదాయం వద్ద ఈనెల 16న నిర్వహించనున్న లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత తెలిపారు. బుధవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, బ్యాంకు సిబ్బందితో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షులు డీవీ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర



శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఏపీడీ సన్యాసిరావు

పాతపట్నం: అటవీ ఉత్పత్తులకు మద్దతు ధరు కల్పనే వీడీవీకేఎస్‌ల లక్ష్యమని వెలుగు ఏపీడీ ఎల్.సన్యాశిరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వందన వికాస్ కేంద్ర సభ్యు ల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారుల బారిన పడకుండా కొనుగోలు, విక్రయాలు జరిగేలా అవగాహన కల్పించారు. ఏపీఎం మనోరత్నం, ఎల్‌హెచ్ డీపీఎం నారాయణరావు, బీఎల్ డీపీఎం సుశీల పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

సంతబొమ్మాళి: ఉన్నత చదువులకు తొలిమెట్టు అయిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని దండుగోపాలపురం, బోరుభద్ర జెడ్పీ హైస్కూల్ హెచ్.ఎం. లు కోత చైతన్య, పి.రామకృష్ణలు అన్నారు. బుధవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, బాడాన రాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు ప్రారంభం

నందిగాం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆర్బీకేలు, సచివాలయాలు, సామాజిక భవనాలను వైసీపీ సమన్వయకర్త పేడాడ తిలక్, ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి తో కలిసి ప్రారంభించారు. ఈ మేరకు బుధవారం పెద్దలవునిపల్లి రైతుభరోసా కేంద్రం, చిన్నలవునిపల్లిలో సామాజిక భవనం, కాపుతెంబూరు, బెజ్జిపల్లిలో గ్రామ సచివాలయాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వై.చక్రవర్తి ఎ.శ్రీనివాసరావు, జె.జయరాం, టి.ఫాల్గుణరావు, ఆశారాణి, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై అప్రమత్తం

పోలాకి: అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు రెండు రోజుల్లో కోడ్ రానుందని... బీఎల్‌ఓలు, పంచా యతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అప్రమత్తం కావాలని ఎంపీడీవో ఉషశ్రీ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, బీఎల్‌ఓలతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చిన వెంటనే గ్రామాల్లో ఉన్న రాజకీయ నేతల విగ్రహాలపై ముసుగులు వేయాలని, పార్టీల ఫ్లెక్సీలు తొలగించాలని ఆదే శించారు. ఎన్నికల దృష్ట్యా ఎవరూ సెలవు పెట్టరాదని మండల పరిషత్ సిబ్బందికి సూచించా రు. ఆమె వెంట సూపరింటెండెంట్ బలగ ప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ దయాకరరావు, జూనియర్ అసిస్టెంట్ గోపాలరావు, పంచాయతీ అధికారిణి పద్మావతి, జ్యోతి, దేవి ఉన్నారు.

22 మందికి వికలాంగ పింఛన్లు నిలిపివేత

జలుమూరు: సైరిగాం పంచాయతీలో 22 మంది వికలాంగ పింఛన్లను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో ఎ.దామోదరరావు తెలిపారు. సైరిగాంలో నకిలీ వికలాంగ ధ్రువపత్రాలతో పత్రాలతో అనర్హులు పింఛన్లు పొందుతున్నారని, వాటిపై దర్యాప్తు చేయాలని గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత నెల 3న నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే విచారణకు హాజరు కావాలని నోటీసులు అందజేశారు. ఈ విచారణకు ఒకే ఒక్కరు హాజరయ్యారు అనర్హులని తేలడంతో ఆ పింఛనును అధికారులు నిలుపుదల చేశారు. విచారణకు హాజరు కాని 22 మంది వికలాంగ పింఛన్లను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారందరికీ సంబంధిత పంచాయతీ కార్యదర్శుల ద్వారా నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

పోలీసుల కవాతు

టెక్కలి: ఎన్నికల వేళ ఓటర్లలో ధైర్యం నింపేందుకు పోలీసులు ఆర్‌పీఎఫ్ బెటాలియన్‌తో కలిపి బుధవారం పట్టణంలో కవాతు నిర్వహించారు. మెయిన్ రోడ్డు, పాత జాతీయ రహదారి ప్రాంతాల్లో ఎస్ఐ పి.లక్ష్మి, వారణాసి వెంకట్రావు, సిబ్బంది కవాతులో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించండి

బొర్రంపేట (ఎల్.ఎన్.పేట): సాధారణ ఎన్నికల సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసర మైన మౌలిక సదుపాయాలు కల్పించా లని తహసీల్దార్ రాణీఅమ్మాజి అన్నారు. బొర్రంపేట గ్రామంలో గల పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహ రించే అధికారులు, సిబ్బందిపైన తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో పాటు ఆర్.ఐ.గవరయ్య పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న నూరుల్ ఖమర్

ఎన్నికల రూట్ మ్యాప్ సిద్ధం

టెక్కలి: ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌వో నూరుల్ ఖమర్ ఆధ్వర్యంలో 315 పోలింగ్ స్టేషన్లను కలుపుతూ రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. సెక్టోరియల్ ఆఫీసర్లు, పోలీస్ ఆఫీసర్లు, ఏఈఆర్‌వోలు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన సిబ్బందికి వివిధ సూచనలు చేశారు. ఎన్ని వాహనాలు అవసరమో గుర్తించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కె.జనార్దనరావు, డివిజన్ గణాంకాధికారి పీసీ నందా పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

ఎన్నికల్లో రాజకీయ పార్టీలు నామినేషన్ పత్రాన్ని ఎలా నింపాలి, ఎలా వేయాలి అన్నది రిటర్నింగ్ అధికారి నూరుల్ ఖమర్ తన కార్యాలయంలో వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల విధులపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నుంచి బగాది శేషగిరి, లాయర్ అచ్చెన్నాయుడు, బీఎస్పీ నుంచి బోకర నారాయణరావు, కాంగ్రెస్ పార్టీ నుంచి కోత మధు, సీపీఎం నుంచి నంబూరు షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరికరాల పంపిణీ

వజ్రపుకొత్తూరు: బాతుపురం హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు పరీక్ష పరికరాలను ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ రవి బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బల్ల సుభాష్, ఉపాధ్యాయులు శంకరరావు, సంజయ్, పాఠశాల చైర్మన్ నీలకంఠం పాల్గొన్నారు.

కిల్లమ్మ ఆలయానికి శంకుస్థాపన

హరిపురం: మందస మండలంలోని కిల్లమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన అగ్గున్న మన్మథరావు దంపతులు భూమి పూజ చేశారు. అనంతరం అమ్మవారిని ముగ్రాటలతో చల్లదనం చేసి పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డులోకి మార్చారు. సుమారు రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ ఆలయానికి దేవదాయ శాఖ తరఫున నిధులు సమకూర్చనున్నట్లు ఈవో ప్రభాకరరావు తెలియజేశారు.



పూజలు చేస్తున్న మన్మథరావు దంపతులు



మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

మొల్ల విగ్రహావిష్కరణ

నరసన్నపేట: స్థానిక కుమ్మరివీధిలో కవయిత్రి మొల్ల విగ్రహాన్ని విశ్రాంత మేజిస్ట్రేట్ సదాశివుని ప్రభాకరరావు, రాయల కృష్ణమూర్తి ఆవిష్కరించారు. రూరిటి కామేశ్వరరావు, సదాశివుని కృష్ణ, రాయల జగదీష్, మల్లేసు, దుర్గారావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు

జలుమూరు: క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదివితే ఉజ్వల భవిష్యత్తు అందుకోగలరని ప్రధానోపాధ్యాయులు ఎం.కృష్ణారావు అన్నారు. తిమడాం ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు ధవళ సరస్వతి, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహాల ఏర్పాటుకు చర్యలు

జలుమూరు: ప్రతీ పాఠశాలలోనూ చదువుల తల్లి సరస్వతీ దేవి విగ్రహాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని ఎంఈవో బి.మాధవరావు కోరారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన సరస్వతీదేవి విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలను సరస్వతీ నిలయాలుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రధానోపాధ్యాయులపైనే ఉందన్నారు. గ్రామపెద్ద, టీడీపీ నాయకులు మునుకోటి దామోదరరావు పిల్లల ఆట సామగ్రిని ప్రారంభించారు. మండల ఉపాధ్యక్షులు డోల నాగరత్నం ఆటస్థలాన్ని ప్రారంభించారు. ఎంఈవో-2 ప్రసాదరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆట వస్తువులను ప్రారంభిస్తున్న దామోదరరావు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం

నరసన్నపేట: ఆర్ఎస్ఎస్, బీజేపీలు పెంచి పోషిస్తున్న మతోన్మాద కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు అన్నారు. బుధవారం కోమర్తిలోని అమర వీరుల స్థూపం వద్ద మామిడి అప్పలసూరి 27వ వర్ధంతి బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ నెల 21న అప్పలసూరి వర్ధంతి సభకు తరలిరావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాండ్ర ప్రకాశ్, ప్రజా సంఘాల నాయకులు నేతింటి నీలంరాజు, సన్నశెట్టి రాజశేఖర్, గణేష్, ఎస్.క్రిష్ణవేణి, బగ్గు భాస్కరరావు, సార జగన్ తదితరులు పాల్గొన్నారు.

బెంతొరియాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దు

● గిరిజనుల ఆధ్వర్యంలో ర్యాలీ



ఏవోకు వినతిపత్రం సమర్పిస్తున్న గిరిజనులు

కంచిలి/పలాస రూరల్: బెంతొరియాలు, బోయ, వాల్మీకి కులాలను ఎస్టీలో జాబితాలో చేర్చవద్దని జిల్లా గిరిజన సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఏవో కృష్ణారావుకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. బెంతొరియాలను ఎస్టీలో జాబితాలో చేర్చరాదని కోరుతూ కంచిలి నుంచి పలాసకు 40 కిలోమీటర్లు గిరిజనుల ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టి పలాస ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జేఏసీ సంఘ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో బెంతొరియాలుగా చెప్పుకుంటూ కొన్ని కులాలు తిరుగుతున్నాయని... వారు నిజమైన ఎస్టీలు కాదని అన్నారు. విజయనగరం జిల్లా ఏర్పడిన అనంతరం బెంతొరియాలు ఆ ప్రాంతంలో ఉన్నారని... శ్రీకాకుళం జిల్లాలో ఎవరూ లేరన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జీవో-52 ప్రకారం శామ్యూల్ ఏకసభ్య కమిషన్ వేసి బెంతొరియాలు, వాల్మీకి, బోయలను గిరిజన తెగల్లో చేర్చేందుకు విశ్వప్రయత్నం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఏపీ అసెంబ్లీలో ఈ అంశంపై రెండుసార్లు తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించారని... వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామన్నారు. అనంతరం సమస్యలపై ఆర్డీవో కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు సవర రాంబాబు, ఏఐఏఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జగన్నాయకులు, ఏఎస్ ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు, డీఎల్‌ఓ జిల్లా అధ్యక్షులు ఎస్.కుమార్, ఆదివాసీ చైతన్య వేదిక డీఎల్‌ఓ జిల్లా అధ్యక్షులు సంజీవరావు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్.మోహన్ పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

● మూడు రైసు మిల్లులు.. ఒక కర్మాగారంలో చోరీ


టీఎస్ఆర్ రైస్ మిల్లులో బీరువా తెరిచిన దృశ్యం

నరసన్నపేట: జమ్ము జంక్షన్‌లో గల మూడు రైసు మిల్లులు, ఓ పరిశ్రమలో బుధవారం రాత్రి దొంగలు చొరబడి చోరీకి పాల్పడ్డారు. రాత్రి రెండు గంటల సమయంలో నలుగురు వ్యక్తులు ముఖాలకు మాస్కులు ధరించి శాంతామణి రైస్ ఇండస్ట్రీ, జమ్ము వద్ద గల శాంతారామ రైస్ మిల్లు, లక్ష్మీనాగేశ్వర రైస్ మిల్లు, ఆకులు తయారీ చేసి ఫ్యాక్టరీల్లో చోరీలకు పాల్పడారు. వాచ్‌మెన్లు, మిల్లర్లు తెలిపిన వివరాల మేరకు.. నలుగురు వ్యక్తులు మాస్కులు ధరించి రాడ్లతో రైస్ మిల్లులో ఆఫీసు గదుల తాళాలను పగలు గొట్టి చోరీకి పాల్పడ్డారు. అక్కడ కాపాలగా ఉన్న నైట్ వాచ్‌మెన్లను భయపెట్టి దోపిడికి పాల్పడ్డారు. సీసీ కెమెరా రికార్డు అయ్యే హార్డ్ డిస్కులు చోరీ చేయడంతో పాటు బీరువాలను పగలుగొట్టి కొంత మొత్తంలో ఉన్న నగదు అపహరించుకుపోయారు. నరసన్నపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన ప్రాంతాన్ని ఎస్ఐ అశోక్‌బాబు పరిశీలించారు. అలాగే జమ్ము గ్రామంలో కోళ్ల దొంగలు హల్‌చల్ చేశారు. అనాస కృష్ణకు చెందిన కోళ్లను పట్టుకుపోయారు. ఇటీవల దొంగతనాలు జోరుగా సాగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురువుతన్నారు.

వివాహిత ఆత్మహత్య

కవిటి: ఇద్దువానిపాలెం గ్రామానికి చెందిన కర్రి ఉర్వశి(19) బుధవారం ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్ఐ రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఇదే గ్రామానికి చెందిన బి.శ్యామ్‌కుమార్‌తో ఉర్వశికి ఆరు నెలల కిందట ప్రేమ వివాహం జరిగింది. వీరు అత్తవారింట జీవనం సాగిస్తుంది. శ్యామ్‌కుమార్ వేట సాగించేందుకు బుధవారం వేకువజామున వెళ్లాడు. ఇంట్లో అత్తలేని సమయంలో ఉర్వశి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఊర్వశి తల్లి పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కాగా ఆమె మృతికి గల కారణాలు తెలియరావల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బూర్జ: అన్నంపేట గ్రామంలో బుధవారం సెప్టిక్‌ట్యాంక్‌పై పలకలు వేస్తుండగా ప్రమాదవశాత్తూ ఒక పలక విరిగిపోవడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్టు 108 వాహన సిబ్బంది శ్రీను తెలిపారు. వెంకటరమణ అనే వ్యక్తికి మెడ దగ్గర తీవ్రగాయాలు కాగా, మరో వ్యక్తికి కాలుకు గాయమైంది. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్టు తెలిపారు.

240 మద్యం సీసాల స్వాధీనం

రణస్థలం: లావేరు మండలం మురపాక గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న 240 మద్య సీసాలతో కుప్పిలి గ్రామానికి చెందిన కె.మోహన్‌ను మంగళవారం రాత్రి డీటీఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. మద్యం సీసాలతో పట్టుబడిన వ్యక్తిని రణస్థలం ఎస్ఈబీ సిబ్బందికి అప్పజెప్పారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కుప్పిలి మోహన్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఈబీ ఎస్ఐ రవిప్రసాద్ తెలిపారు.

అభివృద్ధికి రాజకీయాలు పులమొద్దు

● సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్


తరగతి గదులను ప్రారంభిస్తున్న గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: మానవ సేవే మాధవ సేవ అన్న లక్ష్యంతో సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపడుతుంటే వైసీపీ నాయకులు రాజకీయ రంగు పులమడం సరికాదని టీడీపీ యువ నాయకుడు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ అన్నారు. సింగుపురం పంచాయతీ పరిధి కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో రూ.2.5 లక్షలు వెచ్చించి నిర్మించిన రెండు తరగతి గదులను బుధవారం గొండు శంకర్ ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలలో పూర్తిస్థాయిలో గదులు లేకపోవడంతో 9,10 తరగతుల విద్యార్థులు ఆరు బయట చదవుకునే పరిస్థితి నెలకొందని ప్రిన్సిపాల్, ఏపీసీ తనను సంప్రదించారన్నారు. దీంతో ఎనిమిది నెలల కిందట రూ.2.5 లక్షలతో రెండు తరగతి గదులు నిర్మించానన్నారు. అయితే వాటిని ప్రారంభించనీయకుండా స్థానిక వైసీపీ నాయకులు అడ్డుగా నిలుస్తూ వచ్చారని ఆరోపించారు. నాడు-నేడు పేరుతో స్కూల్స్ అభివృద్ధి చేస్తున్నట్టు సొంత డాబ్బాలు కొట్టుకునే అధికార పార్టీ నేతలు ఇక్కడి పరిస్థితిని గాలికొదిలేశారని విమర్శించారు. తరగతి గదులు నిర్మించాలని అడిగిన వారితోపాటు ఉపాధ్యాయులు కూడా ప్రారంభోత్సవంలో పాల్గొనకుండా చేయడం.. అధికార పార్టీ నాయకుల అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. అలాగే శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో కూడా విద్యార్థుల కోసం ఆడిటోరియం నిర్మించమని అడిగితే ఎనిమిది నెలల కిందటే కట్టించానని, దాని ప్రారంభోత్సవానికి కూడా అడ్డు పడుతున్నారని ఆరోపించారు. ఈ నెల 14వ తేదీన ఉదయం 10 గంటలకు ఎవరు అడ్డుకున్నా ఆడిటోరియం ప్రారంభిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు నీచ రాజకీయాలు మానుకోవాలని శంకర్ హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై వైద్యుల ఫిర్యాదు

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ రామ్‌దాస్, జూనియర్ అసిస్టెంట్ ఎం.అనూషపై ఆసుపత్రికి చెందిన వైద్యులు సుజాత, ప్రియాంక, ప్రతిభ ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు బుధవారం వారంతా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూపరింటెండెంట్ రామదాస్ 10 గంటలకు హాజరువేసుకుని తిరిగి తన రూమ్‌కు వెళ్లిపోతున్నారని, జూనియర్ అసిస్టెంట్ సమయానికి రాకపోవడంతో ఇబ్బందిపడుతున్నట్టు తెలిపారు. హెచ్‌డీఎస్‌లో నిధులు ఉన్నా తాము సూచించిన ఓటీ పరికరాలు, సిజర్స్ కొనాలని చెప్పినా వారికి నచ్చినవి కొనుగోలు చేస్తున్నారని, దీంతో శస్త్ర చికిత్సల సయమంలో ఇబ్బంది పడతున్నామన్నట్టు డీసీహెచ్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

స్వావలంబనకు దోహదం

శ్రీకాకుళం క్రైం: రైతుల ఆర్థిక స్వావలంబకు వ్యవసాయ డ్రోన్స్ దోహదపడతాయని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రైతులకు తక్కువ ఖర్చు, రసాయనాలతో తక్కువ సమయంలో పిచికారి చేయడానికి నమో డ్రోన్ ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో బుధవారం న మో డ్రోన్ దీదీలు మంత్రిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రోజు రోజుకు వ్యవసాయానికి దూరమవుతున్న రైతన్నలకు ఈ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ శిమ్మ నేతాజీ, జాయింట్ డైరెక్టర్ శ్రీధర్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ఏడీఏ రజని, గార ఏవో పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

‘సూపర్ సిక్స్’తో మహిళా సాధికారత

● ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

అరసవల్లి: సూపర్ సిక్స్ పథకాల అమలు ద్వారా రాష్ట్రంలో మహిళా సాధికారత, అభివృద్ధి సాధ్యమని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. బుధవారం నగర కార్పొరేషన్ పరిధిలో గల స్థానిక 33వ డివిజన్ గూనపాలెంలో కొర్ను నాగార్జున ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి సూపర్ సిక్స్‌పథకాలను ఎంపీ వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీతోనే ఇది సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


అరసవల్లి: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీ, తదితరులు

మహిళలే టీడీపీ విజయసారథులు


ఆమదాలవలస: జొన్నవలసలో ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

ఆమదాలవలస: రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలే టీడీపీ విజయానికి రథసారథులని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. బుధవారం ఆమదాలవలస మున్సిపాలిటీ 12వ వార్డు లక్ష్మీనగర్, చంద్రయ్యపేట, రెడ్డిక్వార్టర్స్, పాలపోలమ్మ గుడి ప్రాంతాల్లో మున్సిపల్ మాజీ ఛైర్మన్ తమ్మినేని గీత, టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు బోయిన సునీత ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు పేడాడ రామ్మోహన్, తమ్మినేని విద్యాసాగర్, కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే జొన్నవలస గ్రామంలో టీడీపీ నాయకులు సనపల డిల్లీ, తమ్మినేని శేఖర్, నూకరాజు, కోరుకొండ రమణమూర్తి ఆధ్వర్యంలో టీడీపీ పథకాలపై అవగాహన కల్పించారు.

సింగూరులో బాబు ష్యూరిటీ..


పొందూరు: బాబు ష్యూరిటీలో టీడీపీ నాయకులు

పొందూరు: అచ్చిపోలవలస పంచాయతీ సింగూరు గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ అందించే సంక్షేమ పథకాలు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డి.జగన్మోహనరావు, డి.గణపతి తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీదే విజయం


బూర్జ: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విశ్వప్రసాద్

బూర్జ: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం వస్తుందని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ తెలిపారు. పెద్దపేట, ఉప్పినివలస, ఓవీపేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సి అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆనెపు రామకృష్ణ, సర్పంచ్ ఆనెపు వరలక్ష్మి, పార్టీ నాయకులు మొదలవలస రమేష్, పైడి సత్యప్రసాద్, రాంజీ, గోపి, కడగల కృష్ణ, శ్రీరామ్మూర్తి, గణపతి, జగన్నాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పేదలకు వరం


అవగాహన కల్పిస్తున్న జయదేవ్

ఇచ్ఛాపురం: చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలు పేదలపాటి వరం అని ఇచ్ఛాపురం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కాళ్ల జయదేవ్ అన్నారు. బుధవారం 21వ వార్డు 40వ బూత్ పరిదిలో సూపర్ సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాలిన జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

● **సరుబుజ్జిలి:** దుబ్బవలసలో టీడీపీ నాయకులు ఎండ రామారావు, కొమ్మనాపల్లి రవికుమార్, దవళ సింహాచలం, రామకృష్ణ ఆధ్వర్యంలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. పార్టీ నాయకులు ఉమామహేశ్వరరావు, గురుమూర్తి, శ్రీనివాసరావు, గోపాలరావు, సూర్యం, రామ్మూర్తినాయుడు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.


సరుబుజ్జిలి: దుబ్బవలసలో ప్రచారం చేస్తున్న దృశ్యం

వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి


రణస్థలం: పైడి పేటలో ప్రచారం చేస్తున్న రామ్‌మల్లిక్ నాయుడు

రణస్థలం: వైసీపీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు అన్నారు. బుధవారం కోష్ట, పైడిపేట గ్రామాల్లో ఆయన పర్యటించి బాబు సూపర్ సిక్స్‌పై అవగాహన కల్పించారు. వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అరాచకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికలలో వైసీపీని బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. బావితరాల భవిష్యత్ కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ ఏకమయ్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పిషిని జగన్నాధంనాయుడు, పైడి అప్పడదొర, కనకారావు, దన్నాన సత్తిబాబు, పిషిని అసిరినాయుడు, రౌతు శ్రీనివాసరావు, బొట్ల రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో భారీ చేరికలు

పొందూరు: మండలంలోని పలు కుటుంబాలు బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కంచికామాక్షి విశ్వబ్రాహ్మణ సేవా సంఘానికి చెందిన 30 కుటుంబాలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవి కుమార్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు మండల టీడీపీ ఉపాధ్యక్షులు బాడాన గిరి, గారపేట సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరినవారితో కూన రవికుమార్

‘క్రషర్ బుగ్గి వేసి వదిలేశారు’

పొందూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకంలో భాగంగా చేసిన పనుల్లో అవినీతితోపాటు పాఠశాలలో వేసిన రోడ్డుపై స్పీకర్ తమ్మినేని సీతారాంకు పలువురు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో బుధవారం నాడు-నేడు నిధులతో నిర్మించిన తరగతి గదులను స్పీకర్ ప్రారంభించి మాట్లాడారు. కాగా రూ1.46 కోట్ల నాబార్డు నిధులతో చేసిన పనులపై పలు ఆరోపణలు ఉన్నాయి. రూ.3.80 లక్షలతో పాఠశాల ప్రాంగణంలో టైల్స్‌తో కూడిన రోడ్డు వేయాల్సి ఉండగా, క్రషర్ బుగ్గి వేసి వదిలేశారు. దీనికి హెచ్‌ఎం రూ.3.50 లక్షల బిల్లు చెల్లించడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డుకు టైల్స్ వేయకపోవడంతో దుమ్ము,దూళి రేగుతుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పలువురు విద్యార్థులు స్పీకర్, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కాగా ప్రారంభోత్సవ రాయిపైనా ప్రొటోకాల్ ప్రకారం ఎంఈవోల పేర్లు లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ ఛైర్మన్ దుంపల రామారావు, జడ్పీటీసీ కాంతారావు, ఎంపీపీ ఉషారాణి, పార్టీ మండల అధ్యక్షులు పి.రమేష్, ఎంఈవో-2 పి.రాజారావు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక చైతన్యం


మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఎచ్చెర్ల: మహిళలు విద్యతోనే సామాజిక చైతన్యాన్ని పొందుతున్నారని ఆంధ్రా యూనివర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారిత సాధిస్తేనే మహిళలు పూర్తిస్థాయిలో విజయం సాధించగలరన్నారు. చట్టసభల్లో మహిళల ప్రాధాన్యం పెరిగితే వారు ఎదుర్కొంటున్న సవాళ్లకు కొంత పరిష్కారం లభిస్తుందన్నారు. బీఆర్ఏయూ వీసీ కేఆర్ రజని మాట్లాడుతూ.. మహిళల పట్ల వివక్షత, విస్మరణ నుంచే అనేక ఉద్యమాలు వచ్చాయన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా వర్సిటీ మహిళా ఉద్యోగినులు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వర్సిటీ రెక్టార్ బిడ్డిక అడ్డయ్య రిజిస్ట్రార్ పీలా సుజాత, వర్సిటీ ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, సీహెచ్ రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

‘పార్టీకి ద్రోహం చేస్తే ఉపేక్షించేది లేదు’


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

సరుబుజ్జిలి: టీడీపీలో ఉంటూ పార్టీ విధివిధానాలకు కట్టుబడి ఉండకుండా ద్రోహం చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించని లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ హెచ్చరించారు. బుధవారం సరుబుజ్జిలిలో పార్టీ మండల అధ్యక్షుడు తాడేలా రాజారావు ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికలను ప్రతి కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు పేడాడ రామ్మోహన్, శివ్వాల సూర్యనారాయణ, కిల్లి సిద్దార్థ, లావేటి పూర్ణారావు, సురవరపు జగదీష్, కె.సూర్యనారాయణ, పైడి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం రూరల్: పెండింగ్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి కోర్టులో చార్జ్‌షీట్ దఖలు చేయాలని ఎస్పీ జీఆర్ రాధిక సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో లీగల్‌గా ఉన్నవాటిపై దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. రేప్, ఫోక్సో కేసుల్లో దర్యాప్తు 60 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అక్రమ మద్యం, సారా, గంజాయి రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నేర పరిశోధన, అక్రమ రవాణాపై సమాచార సేకరణలో ప్రతిభ కనబరిచిన హెడ్ కానిస్టేబుల్స్ మోహనరావు, కోండదరావు, రమణమూర్తి, కానిస్టేబుల్ ఉషాకిరణ్‌లను ప్రశంసాపత్రాలతో అభినందించారు. ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్, డీఎస్పీలు వై.శృతి. డి.బాలచంద్ర రెడ్డి, జి.నాగేశ్వర రెడ్డి, బి.విజయకుమార్, తిరుమలరావు, ఆర్.శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ రాజు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నేత తరుణాచారికి నివాళి

సోంపేట: సమరశీల పోరాటాలు చేయడమే తొలితరం కమ్యూనిస్టు గానుగుల తరుణాచారికి మనమిచ్చే నివాళి అని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు అన్నారు. మామిడిపల్లిలో తరుణాచారి విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరుణాచారి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారన్నారు. జుత్తు సింహాచలం, పాతిన కృష్ణమూర్తి, సంగారు లక్ష్మీనారాయణ, తెప్పల పాపారావు, కర్రి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించండి

శ్రీకాకుళం క్రైం: రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే గుర్తించిన సామస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో సమస్యాత్మక గ్రామాలపై ఎస్పీ సమీక్షించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ప్రతి రోజు సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించాలని, ఎప్పటికప్పుడు గ్రామస్థులతో మాట్లాడాలని, గొడవలు, అల్లర్లు జరగకుండా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. గత ఎన్నికల్లో పోలింగ్ సమయంలో అల్లర్లు జరిగిన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రాలను తనిఖీలు చేసి భౌగోళిక పరిస్థితులు, మౌలిక సదుపాయాలపై పరిశీలించాలన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రతీ ఒక్క పోలీసుకు ఎన్నికల నియమావళిపై అవగాహన కలిగి ఉండాలని, ఆ దిశగా అధికారులు చొరవ చూపాలన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

వేలం పాట రద్దు చేయాలి

ఇచ్ఛాపురం: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన రోజువారీ మార్కెట్, వీధిగుత్త వేలం పాట రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని వైసీపీ కౌన్సిలర్లు బచ్చు జగన్, సీహెచ్ జగన్, సుగ్గు ప్రేంకుమార్ కోరారు. బుధవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం కౌన్సిల్ హాల్‌లో జరిగింది. ఎజెండాలో పొందుపరిచిన డైలీ మార్కెట్, వీధిగుత్త, కమేళా వేలం పాటలకు కౌన్సిల్ ఆమోదం కోరగా.. ఈ అంశాలపై చర్చ జరిగింది. మున్సిపాల్టీలో నిర్వహించిన వేలంపాట తక్కువగా వెళ్లడంతో మున్సిపాల్టీకి ఆదాయం తగ్గిందని, అందువల్ల దాన్ని రద్దు చేసి మళ్లీ వేలం పాట నిర్వహించాలని వైసీపీ కౌన్సిలర్లు కోరారు. దీనిపై స్పందించిన ఛైర్‌పర్సన్ ఇప్పటికే రెండు సార్లు వేలం పాట నిర్వహించామని, మూడో సారి సీల్డ్ టెండర్ ప్రకారం వేలం పాట నిర్వహించనున్నట్టు తెలుపుతూ వేలం పాటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ , వైస్ ఛైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి, కౌన్సిలర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

చదువుల్లో రాణించాలి

ఇచ్ఛాపురం: చదువుల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఈదుపురం జడ్పీ హెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం బి.రామారావు అన్నారు. బుధవారం పాఠశాలలో హెచ్ఎం అధ్యక్షతన ఫేర్‌వెల్ ఫంక్షన్ నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గ్రామ పెద్దలు రామచంద్ర బెహరా, మురా బెహరా, ఎస్ఎంసీ ఛైర్మన్లు గౌరోహరి బెహరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులో ఉన్న కో దండరామ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 108 కలశాలతో నదీ జలాలు, పాలు, పెరుగు, తేనె పంచామృతాభిషేకం నిర్వహించారు. అర్చకులు చామర్తి శ్రీనివాసాచార్యులు బంకుపల్లి శేషా చార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్షేన పూజలు చేశారు.

వంద రోజులు పని కల్పించండి

లావేరు: ఉపాధి హామీ పథకంలో అధిక శాతం కుటుంబాలకు వంద రోజులు పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ లోకేష్ అన్నారు. బుధవారం స్థానిక ఎంసీసీ కార్యాలయంలో లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాలకు సంబంధించిన ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఏపీవోలు ఆర్.సత్యవతి, సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులే కీలకం

కలెక్టరేట్: ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర ఎంతో కీలకమని డీఆర్వో ఎం.గణపతిరావు అన్నారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సూక్ష్మపరిశీలకుల విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో శిక్షకులు మెప్మా పీడీ కిరణ్‌కుమార్, డ్వామా పీడీ చిట్టిరాజు, డీసీవో ఎస్.బాలరాజు, శేషగిరి, ఎల్‌డీఎం సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతికి మొల్లమాంబ ప్రతీక

కలెక్టరేట్: రామాయణాన్ని ఆంధ్రీకరించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ అని డీఆర్వో ఎం.గణపతిరావు అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం మొల్లమాంబ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో మాట్లాడుతూ.. మొల్లమాంబ రచించిన మొల్ల రామాయణం చాలా సరళమైన తేనెలొలికే తేట తెలుగులో రచించడం జరిగిందన్నారు.

● **శ్రీకాకుళం క్రైం:** జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం తొలి తెలుగు కవయిత్రి కుమ్మర మొల్లమాంబ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్ల ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్ పూలమలా వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఎస్పీ ప్రేమ్ కాజల్ మాట్లాడుతూ.. మహనీయులు వాల్మీకి రచించిన రామాయణం ఆధారం చేసుకుని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తెలుగు భాషలో మొల్లమాంబ రామాయణం రాయడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో ఏవో గోపినాథ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన

శ్రీకాకుళం రూరల్: జిల్లాలో మారుమూల ప్రాంతానికి చెందిన ముద్దాడ శిరీష క్రీడారంగంలో రాణించాలన్న సంకల్పంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం జిల్లాకు గర్వకారణమని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ధర్మానను శిరీష మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఫిబ్రవరి 24న రాంచీలో జరిగిన ఖేలో ఇండియా పోటీల్లో ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించింది. ఈ నేపథ్యంలో ఆమెను సత్కరించారు.

‘మీ చేతులు మీరే నరుక్కోవద్దు’

గార: రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని వదులుకుంటే మీ చేతులు మీరే నరుక్కున్నట్టు అవుతుందని మంత్రి ధర్మాన ప్రసాదరావు డ్వాక్రా మహిళలను ఉద్దేశించి అన్నారు. బుధవారం ఉదయం గారలో చేయూత చెక్కులు పంపిణీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఈ పథకాలన్నీ మళ్లీ కొనసాగాలంటే ఈ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని, ఇందుకు మీరంతా కార్యకర్తల్లా పనిచేయాలని అన్నారు. చంద్రబాబు మోసపూరిత మాటలు తప్ప చేతల్లో ఎక్కడ ఇటువంటి సంక్షేమ పథకాలు అందించలేదని అన్నారు. ఎంపీపీ రఘురామ్, జడ్పీటీసీ మార్పు సుజాత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

గార: ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మయిదేవి బుధవారం తాళ్లవలసలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పోషణ పక్వాడ ఉత్సవాల్లో భాగంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ.. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పౌష్టికాహారం లోపం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం కొల్లివలస వద్ద ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో చర్చించారు. అక్కడే తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతిలో పాల్గొన్నారు. సీడీపీవో డి.రాధా మాధవి తదితరులు పాల్గొన్నారు.

158 మందికి రూ.1.01కోట్ల లబ్ధి

కలెక్టరేట్: జిల్లాలో పీఎం సూరజ్ పథకం కింద ఎస్సీ, ఓబీసీ, సఫాయి కర్మచారీ కార్మికులకు సంబంధించి 158 మంది లబ్ధిదారులకు రూ.1.01 కోట్లు, 31 మందికి నమస్తే ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, పీపీఈ కిట్లను కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ బుధవారం అందజేశారు. ప్రధానమంత్రి మోదీ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశంలో 522 జిల్లాలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీకాకుళం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమాన్ని కలెక్టర్‌తో పాటు ఎస్సీ కార్పొరేషన్ అధికారి గడ్డెమ్మ, సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వమోహన్‌రెడ్డి, ఎల్‌డీఎం సూర్యకిరణ్, మున్సిపల్ హెల్త్ అధికారి వెంకటరావు, శ్రీశయన కార్పొరేషన్ డైరెక్టర్ డీబీ దేవ్ లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులను, పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్లను కలెక్టర్ అందజేశారు.

హింసకు తావులేని ఎన్నికలే లక్ష్యం

కలెక్టరేట్: రానున్న సార్వత్రిక ఎన్నికలు హింసకు తావులేకుండా, రీ పోలింగ్ జరిగే అవకాశం ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. ఈ మేరకు బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అయన పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల నిర్వహణకు రూపొందించిన ప్రణాళికలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఈవీఎం, ప్లానింగ్, పోలింగ్ సిబ్బంది, పోస్టల్ బ్యాలెట్ పేపర్ తదితర అంశాలపై రూపొందించిన ప్రణాళికను అమలు చేయాలన్నారు. కలెక్టర్ మన్‌జీర్ జిలాన్ సమూన్, ఎస్పీ రాధిక, జేసీ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఏఎస్పీ ప్రేమ్ కాజల్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ధర్మవరంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడాలంటూ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో డి.తాతారావు, వలంటీర్లు పాల్గొన్నారు.